తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:73

24 క్యారెట్లు 142,050.00 | కిలో వెండి 2,00,000.00 | chourastha Digitals | 13.11.2026 శుక్రవారం, హైదరాబాద్



ఎన్విడియాలో పెను సంచలనం..

- సీఈఓ పదవికి జెన్సన్ హువాంగ్ రాజీనామా
- తాత్కాలిక సారథిగా సీఎఫ్ఓ కొలెట్ క్రెస్
- శాశ్వత సీఈఓ కోసం బోర్డు అన్వేషణ
- ఏఐ చిప్ దిగ్గజంలో అనూహ్య పరిణామం
- ఒక్కసారిగా మారిన నాయకత్వం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

ప్రపంచ టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించిన ఎన్విడియా (NVIDIA)లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సంస్థ సహ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు కంపెనీ బోర్డు ప్రకటించింది. ఆయన స్థానంలో

।మిగతా 2 లో।



దక్షిణాది రాష్ట్రాలకు వర్ష గండం

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

నవంబర్ 13 నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం

14న తీవ్ర అల్పపీడనంగా..

15 నాటికి వాయుగుండంగా మారే సూచనలు

ఏపీ, తమిళనాడు తీరాల వైపు పయనించే ఛాన్స్

నవంబర్ రెండో వారం వచ్చినా

ఉత్తరాదిలో మొదలుకాని చలి

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వరుస తుపాన్ల ప్రభావం నుంచి ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీర ప్రాంతాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా.. తాజాగా మరో అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రం, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో నవంబర్ 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అంచనా

।మిగతా 2 లో।



రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్
- 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు స్థానచలనం
- వీసీ సజ్జనర్‌కు ఫైర్ సర్వీసెస్ డీజీ బాధ్యతలు
- ఏసీబీ డీజీగా చారు సిన్హా.. ఆర్టీసీ ఎండీగా అనిల్‌కుమార్

2లో



యూపీలో కొత్త రాజకీయ కూటమి

- ఒవైసీ, చంద్రశేఖర్ ఆజాద్ జోడీ
- బీజేపీని మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే లక్ష్యం
- 'సామాజిక పరివర్తన మోర్చా' పేరుతో కొత్త కూటమి ఏర్పాటు
- యూపీ సీఎం అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ పేరు ప్రకటించిన ఒవైసీ
- 403 అసెంబ్లీ స్థానాల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడి

22ఏ భూ దరఖాస్తుల పరిష్కారానికి డెడ్‌లైన్

- ఒక్కటీ పెండింగ్‌లో ఉండొద్దు!
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ఆదేశాలు
- దరఖాస్తులన్నీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- జీవో 118, 76 అమలులో వేగం పెంచాలి
- యూఎల్‌సీ భూములపై వారంలోగా నివేదిక ఇవ్వాలి
- ప్రభుత్వ ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించం
- రిజిస్ట్రేషన్ల సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
- భూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేదన్న మంత్రి



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఏ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో 22ఏ భూములకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ

।మిగతా 2 లో।



గ్లోబల్ వేదికగా హైదరాబాద్

- కాంగ్రెస్ సందేశంపై ఆసక్తి.
- సమ్మిట్ కి 70 దేశాల ప్రతినిధుల రాక
- నవంబర్ 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు
- రాహుల్ గాంధీ పర్యటనపై కొనసాగుతున్న ఉత్కంఠ
- ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, అంతర్జాతీయ పరిణామాలపై చర్చలు
- కాంగ్రెస్ అగ్రనేతల హాజరుపై రాజకీయ వర్గాల్లో చర్చ

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న రెండో విడత భారత్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా

।మిగతా 2 లో।




సంప్రదాయ బాణసంచాతో

కీటకాల నిర్మూలన

2లో

- దీపాలతో గాలి శుద్ధి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్
- దీపావళి ఆచారాల వెనుక శాస్త్రీయ కోణం ఉంది
- వన్ హెల్త్' భావన భారతీయ సంప్రదాయ జ్ఞానంలోనే ఉంది
- ఆవు పేడ ప్రయోజనాలను ప్రపంచం గుర్తిస్తోందని వెల్లడి



డిసెంబర్‌లోగా ఉస్మానియా ఆస్పత్రి సిద్ధం కావాలి

- సీఎం రేవంత్ ఆదేశం
- జూన్ 2 నాటికి అందుబాటులోకి మూడు టిమ్స్ ఆస్పత్రులు
- ఒకేసారి మూడు టిమ్స్‌లలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సూచన
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 38 వేలకు పెంపు
- వైద్యారోగ్య శాఖకు అవసరమైనన్ని నిధులు విడుదల చేస్తామని వెల్లడి

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 2 నాటికి మూడు టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.



2లో

డిసెంబర్‌లోగా ఉస్మానియా ఆస్పత్రి సిద్ధం కావాలి

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 2 నాటికి మూడు టిమ్స్ (తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.



మూడు టిమ్స్‌లకు ఒకేసారి నియామకాలు

మూడు టిమ్స్ ఆస్పత్రులకు ఒకేసారి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఉద్యోగుల బదిలీలకు వీలుగా నియామక ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. టిమ్స్ ఆస్పత్రుల్లో హౌస్‌కీపింగ్ సేవలను పూర్తిగా ఔట్‌సోర్సింగ్ విధానంలో నిర్వహించాలని పేర్కొన్నారు. నిమ్స్‌లో పడకలు అందుబాటులోలేని పరిస్థితుల్లో రోగులను సనత్‌నగర్ టిమ్స్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమ్స్, టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు అవసరమైన వైద్యులను బయట నుంచి నియమించుకోవాలని సూచించారు. టిమ్స్, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్సల కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. టిమ్స్‌లతో పాటు బోధన, నర్సింగ్ కళాశాలల నిర్మాణాలు, వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియను ఏకకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరును ఏఐ పర్యవేక్షణతో బయోమెట్రిక్ విధానంలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పెరిగిన వైద్య సేవలు.. నియామకాలపై సమీక్ష

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔట్‌పేషెంట్ల సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్‌పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు చేరడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం నిధులు కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం కేటాయిస్తున్నట్లు వివరించారు.గత మూడేళ్లలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 5,640 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

22ఏ భూ దరఖాస్తుల పరిష్కారానికి డెడ్‌లైన్

తరువాయి భాగం

యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని తేల్చిచెప్పారు.

22ఏ సమస్యలపై సమీక్ష

22ఏ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ సంస్థల అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యలు, జీవో 59 అమలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

ప్రతి వారం సమీక్ష నిర్వహించాలి

జిల్లా స్థాయిలో ప్రతి వారం సంబంధిత అధికారులు సమావేశమై 22ఏ సమస్యల పరిష్కారంపై సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని దరఖాస్తులను ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం చేసే విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.

యూఎల్‌సీ భూములపై వారంలోగా నివేదిక

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూములకు సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరపున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలపై ఉన్నతస్థాయి కమిటీ వారం రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలను కూడా నివేదికలో పొందుపరచాలని సూచించారు. ఈ నివేదికపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి భూముల క్రమబద్ధీకరణపై తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రిజిస్ట్రేషన్ల నిలిచిపోవడంపై దృష్టి

యూఎల్‌సీ, అసైన్డ్, వక్ఫ్, భూదాన్, దేవాదాయ తదితర భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సెప్టెంబర్ 24న ప్రత్యేక మెమోరాండం 47934 జారీ చేసింది. అయినప్పటికీ కొత్తగా యూఎల్‌సీ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన కొన్ని ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన భూములు, వేలం అనంతరం లేఅవుట్లుగా మారిన స్థలాలు, హెచ్ఎండీఏ అనుమతులతో విక్రయించిన ప్లాట్లు, వివిధ ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా క్రమబద్ధీకరించిన స్థలాలు కూడా 22ఏ జాబితా నుంచి తొలగించక పోవడంతో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే సర్వే నంబరులో ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్న సందర్భాల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలో అర్హులైన భూ యజమానులకు ఇబ్బందులు తొలగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

తరువాయి భాగం

వేసింది. ఇది నవంబర్ 14 నాటికి తీవ్ర అల్పపీడనంగా, 15వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. అయితే ఈ వ్యవస్థ తుపానుగా మారుతుందా? ఏ దిశగా పయనిస్తుంది? ఎక్కడైనా తీరం దాటుతుందా? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

తుపానుగా మారితే 'అక్వాన్' పేరు

బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారే అవకాశాలపై ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ నిపుణులు అంచనాలు వెల్లడించారు. సముద్రం, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ వ్యవస్థ తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని స్కైమెట్ వెదర్ నిపుణుడు మహేశ్ పలావత్ విశ్లేషించారు. ఒకవేళ తుపానుగా మారితే దీనికి 'అక్వాన్' అనే పేరు పెట్టనున్నారు. ఈ పేరును ఇరాన్ సూచించింది.

ఏపీ, తమిళనాడు తీరాల వైపు పయనం?

వాతావరణ నమూనాల అంచనాల ప్రకారం ఈ వ్యవస్థ భారత తూర్పు తీరం వైపు కదిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తీర ప్రాంతాల దిశగా పయనించే సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీని కదలికలు, ప్రయాణ మార్గంపై ఇంకా పూర్తి స్పష్టత లేదు. సముద్రంలోనే దిశ మార్చుకునే అవకాశాలను కూడా వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతానికి తుపాను ఏర్పాటుపై లేదా తీరం దాటే ప్రాంతం, తేదీపై ఐఎండీ అధికారిక ప్రకటన చేయలేదు. అందువల్ల ఈ అంచనాలను ప్రాథమికంగానే పరిగణించాల్సి ఉంటుంది.

దక్షిణాది రాష్ట్రాలకు వర్ష సూచన

అల్పపీడనం ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 12 నుంచి 14 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. నవంబర్ 16, 17 తేదీల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కేరళ, మాహే ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు, యానాం, రాయలసీమలో నవంబర్ 14 నుంచి 17 వరకు అక్కడక్కడా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అండమాన్, నికోబార్ దీవుల్లో నవంబర్ 12 నుంచి 17 వరకు విస్తృతంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

హిమాలయ ప్రాంతాల్లో వర్షా లు, మంచు

మరోవైపు హిమాలయ ప్రాంతాల్లోనూ వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. కశ్మీర్, పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షం, మంచు కురిసే అవకాశం ఉంది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ వర్ష సూచనలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఉత్తరాదిని ఇంకా వీడని చలి

నవంబర్ రెండో వారం కొనసాగుతున్నప్పటికీ ఉత్తర, మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత ఇంకా పెరగలేదు. సాధారణంగా ఈ సమయానికి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఈశాన్య భారతదేశంలోని అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయలో నవంబర్ 12న అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ, మధ్య భారతదేశంలో మాత్రం ప్రస్తుతానికి పొడి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ అంచనాలు వెల్లడిస్తున్నాయి.

యూపీలో కొత్త రాజకీయ కూటమి

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. 2027 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్ చేతులు కలిపారు. 'సామాజిక పరివర్తన మోర్చా' పేరుతో కొత్తరాజకీయ కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఒవైసీ వెల్లడించారు. ఈ కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రశేఖర్ ఆజాద్ పేరును ప్రకటించారు. లక్నోలో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు.

అణగారిన వర్గాల హక్కులే ప్రధాన ఎజెండా

వెనుకబడిన, అణగారిన, అట్టడుగు వర్గాల ప్రజలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఒవైసీ విమర్శించారు. ఈ వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడమే తమ కూటమి లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీని అడ్డుకోవడంతో పాటు రాష్ట్రంలో విద్యా వ్యవస్థలోని సమస్యలు, యువత నిరుద్యోగం, రైతుల ఇబ్బందులపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 26న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

403 స్థానాల్లో కలిసి పోటీ

ఈ కూటమిని మూడో ఫ్రంట్‌గా అభివర్ణించడంపై చంద్రశేఖర్ ఆజాద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కేవలం మరో రాజకీయ కూటమి కాదని, సామాజిక పరివర్తన కోసం ఏర్పడిన వేదిక అని పేర్కొన్నారు. అణగారిన, వెనుకబడిన, దోపిడీకి గురైన వర్గాలకు బలమైన రాజకీయ గొంతుకగా నిలుస్తుందని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 403 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడించారు. సీట్ల పంపకాల విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

ఇతర పార్టీలకూ ఆహ్వానం

బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకూడదని భావించే సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు కూడా తమ కూటమికి మద్దతుగా రావచ్చని చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అట్టడుగు వర్గాల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు, వెనుకబడిన వర్గాలు, సామాజికంగా అణచివేతకు గురైన ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ ప్రయత్నమని వివరించారు. 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటైన ఈ కొత్త కూటమి ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో మరిన్ని పార్టీలు ఇందులో చేరుతాయా? ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తులపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎన్విడియాలో పెను సంచలనం..

తరువాయి భాగం

తాత్కాలిక సీఈఓగా సంస్థ ప్రస్తుత చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) కొలెట్ క్రెస్ బాధ్యతలు చేపట్టనున్నారు.ఇటీవల జెన్సన్ హువాంగ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివాదాలు, విదేశీ నిధుల సంస్థలతో సంబంధాలున్నాయనే ఆరోపణలు ఎన్విడియాలో కలకలం రేపాయి. అలిస్ హువాంగ్ అనే మహిళతో సంబంధం ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో జెన్సన్ తన కుటుంబానికి, సంస్థ ఉద్యోగులకు క్షమాపణలు చెబుతూ ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంపై ఎన్విడియా బోర్డు స్వతంత్ర దర్యాప్తునకు కూడా ఆదేశించింది. ఈ పరిణామాల మధ్య ఆయన రాజీనామా నిర్ణయం తీసుకోవడం టెక్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్విడియాలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సీఎఫ్ఓగా పనిచేస్తున్న కొలెట్ క్రెస్ తాత్కాలిక సీఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు అంగీకరించారు. శాశ్వత సీఈఓ నియామకం జరిగే వరకు ఆమె రెండు బాధ్యతలనూ నిర్వహించనున్నారు. పూర్తిస్థాయి సీఈఓ ఎంపిక కోసం బోర్డు అన్వేషణ ప్రారంభించింది. సంస్థలోని సీనియర్ అధికారులతో పాటు బయటి అభ్యర్థుల పేర్లనూ పరిశీలించనున్నట్లు వెల్లడించింది.2013 సెప్టెంబర్‌లో ఎన్విడియాలో చేరిన కొలెట్ క్రెస్.. సంస్థ ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అంతకుముందు మైక్రోసాఫ్ట్, సిస్కో వంటి ప్రముఖ టెక్ సంస్థల్లో ఫైనాన్స్ విభాగంలో పనిచేశారు. దాదాపు 25 ఏళ్లకు పైగా ఆర్థిక రంగంలో అనుభవం సంపాదించారు. ఆమెకు సంస్థ వ్యాపారం, ఆర్థిక పరిస్థితులు, కార్యకలాపాలు, ఉత్పత్తుల ప్రణాళికపై పూర్తి అవగాహన ఉందని బోర్డు చైర్మన్ హార్వే సి. జోన్స్ పేర్కొన్నారు.

తొలిసారిగా బోర్డు చైర్మన్ నియామకం

మరోవైపు ఎన్విడియా చరిత్రలో తొలిసారిగా బోర్డు చైర్మన్‌ను నియమించింది. ఈ బాధ్యతలను హార్వే సి. జోన్స్‌కు అప్పగించింది. గతంలో సినాప్సిస్ సంస్థకు సీఈఓగా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పనిచేసిన ఆయనకు టెక్నాలజీ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. కొలెట్ క్రెస్ నేతృత్వంలో కంపెనీ కార్యకలాపాలు, కస్టమర్లకు ఇచ్చిన హామీలు, ఉత్పత్తుల అభివృద్ధి ప్రణాళికలు యథావిధిగా కొనసాగుతాయని బోర్డు స్పష్టం చేసింది.



మస్క్ వ్యాఖ్యలతోనూ చర్చ

జెన్సన్ హువాంగ్ భవిష్యత్తుపై చర్చ జరుగుతున్న సమయంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ఓ వ్యాఖ్య వైరల్ అయింది. హువాంగ్ తన పదవి నుంచి తప్పుకుంటే ఆయనను తన కంపెనీలో నియమించుకునేందుకు సిద్ధమని మస్క్ అన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ వ్యాఖ్యకు సంబంధించిన అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదు.మొత్తంగా ఎన్విడియా వంటి ప్రపంచస్థాయి ఏఐ చిప్ దిగ్గజంలో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం అంతర్జాతీయ టెక్నాలజీ, వ్యాపార రంగాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

గ్లోబల్ వేదికగా హైదరాబాద్

తరువాయి భాగం

సుమారు 70 దేశాల నుంచి ప్రతినిధులు, ప్రముఖులు, విధాన నిర్ణేతలు హాజరుకానున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, అంతర్జాతీయ అభివృద్ధి, సమకాలీన భౌగోళిక రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈ సమ్మిట్‌కు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరవుతారా? అన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఆయన హైదరాబాద్ పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఒకవేళ పర్యటన ఖరారైతే సదస్సులో ఏయే అంశాలపై ప్రసంగిస్తారు? రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతారా? అనే చర్చ కొనసాగుతోంది.

అంతర్జాతీయ వేదికగా కాంగ్రెస్ భావజాలం

భారత్ సమ్మిట్ వేదికగా ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రగతిశీల విధానాలపై కాంగ్రెస్ తన అభిప్రాయాలను అంతర్జాతీయ ప్రతినిధుల ముందుంచే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. వివిధ దేశాల నుంచి వచ్చే మేధావులు, విధాన నిర్ణేతలతో జరిగే చర్చలు, ముఖాముఖి సమావేశాలు ఈ సదస్సులో కీలకంగా నిలవనున్నాయి.

భారీ ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అంతర్జాతీయ ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లు, సమావేశాల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, తెలంగాణను అంతర్జాతీయ మేధో చర్చలకు, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్రంలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కీలకమైన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) బాధ్యతలను సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ మురళీధర్ భగవత్‌కు అప్పగించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా పనిచేసిన వీసీ సజ్జనర్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డీజీగా బదిలీ చేసింది. అదనంగా ఎస్పీఎఫ్ డీజీ బాధ్యతలను కూడా అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు.

ముఖ్య విభాగాల్లో కీలక మార్పులు

సౌమ్య మిశ్రాను మహిళా భద్రత, షీటీమ్స్, భరోసా డీజీపీగా నియమించడంతో పాటు డీజీపీ ఆర్గనైజేషన్, లీగల్ బాధ్యతలను అప్పగించింది. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీపీగా బదిలీ చేసి, హోంగార్డ్స్ విభాగం అదనపు బాధ్యతలు ఇచ్చింది. చారు సిన్హాను ఏసీబీ డీజీగా నియమించడంతో పాటు సీఐడీ డీజీ బాధ్యతలను అప్పగించింది. అనిల్‌కుమార్‌ను తెలంగాణ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పటివరకు ఆర్టీసీ బాధ్యతలు నిర్వహించిన వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల కమిషనర్‌గా బదిలీ చేసింది. సంజయ్‌కుమార్ జైన్‌కు డీజీపీ ట్రైనింగ్ అదనపు బాధ్యతలు అప్పగించింది. విక్రమ్‌సింగ్ మాన్‌ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీపీ (అపరేష న్స్)గా నియమించింది.

ట్రాఫిక్, రోడ్డు భద్రత విభాగాల్లోనూ మార్పులు

స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేసింది. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా ఉన్న జోయల్ డేవిస్‌కు టీజీటీమార్స్ (రోడ్ సేఫ్టీ) జాయింట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. శ్రీ బాలాదేవిని టీజీటీమార్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా నియమించింది.

లా అండ్ ఆర్డర్ బాధ్యతలు అకున్ సబర్వాల్‌కు

అకున్ సబర్వాల్‌ను అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా నియమించింది. ఎస్. చంద్రశేఖర్ రెడ్డికి ఏసీబీ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది. కార్తికేయను ఐజీపీ మల్టీ జోన్ 1గా బదిలీ చేసి, ఐసీసీసీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చింది. కె. రమేశ్ నాయుడును రైల్వే ఐజీగా నియమించింది.

డీఐజీ, డీసీపీ స్థాయిలోనూ బదిలీలు

చందన దీప్తిని జోగులాంబ రేంజ్ డీఐజీగా, ఆర్. భాస్కరన్‌ను ఇంటెలిజెన్స్ డీఐజీగా నియమించింది. కె. నారాయణ నాయక్‌కు బాసర డీఐజీ బాధ్యతలు అప్పగించింది. ఎల్.ఎస్. చౌహాన్‌ను చార్మినార్ డీఐజీగా నియమించడంతో పాటు కో ఆర్డినేషన్ బాధ్యతలు కూడా ఇచ్చింది. అరవింద్ బాబును హైదరాబాద్ సిటీ డీసీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర పోలీస్ శాఖలో కీలక విభాగాలకు కొత్త అధికారులను నియమిస్తూ ప్రభుత్వం చేపట్టిన ఈ బదిలీలు పరిపాలనా, శాంతిభద్రతల నిర్వహణలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

సంప్రదాయ బాణసంచాతో కీటకాల నిర్మూలన

నాగ్‌పుర్, తెలంగాణ చౌరస్తా:

దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంపై పర్యావరణ పరిరక్షణవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పందించారు. సంప్రదాయ దీపావళి ఆచారాల వెనుక శాస్త్రీయ కోణం ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో ఉపయోగించే సంప్రదాయ బాణసంచాలో హానికరమైన రసాయనాలు ఉండేవి కావని, వాటి నుంచి వెలువడే పొగ పంటలకు హాని చేసే కీటకాలను నిర్మూలించేందుకు దోహదపడేదని అభిప్రాయపడ్డారు. నెయ్యి, నూనెతో వెలిగించే దీపాలు కూడా గాలి నాణ్యతను కాపాడటానికి సహాయపడతాయని అన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీపావళిని పర్యావరణహితంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పండుగ ప్రజలను ఏకం చేస్తుందని, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం ద్వారా సామాజిక ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు. ధర్మం సమాజాన్ని ఐక్యంగా ఉంచే శక్తిగా పనిచేస్తుందని, ఈ



విషయంలో మహిళలకు మరింత అవగాహన ఉంటుందని అభిప్రాయపడ్డారు.

భారతీయ సంప్రదాయంలోనే 'వన్ హెల్త్' భావన

నాగ్‌పుర్‌లో దత్తాజీ మేఘే స్మారక చిహ్నం ఆవిష్కరణతో పాటు వ్యవసాయ కళాశాల, పశువైద్య ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెటర్నరీ విద్యలో వస్తున్న మార్పులు, విద్యార్థులకు అందు

రూ.7.20 కోట్లతో 72 గ్రామ సమాఖ్య భవనాలు

- డ్వాక్రా సంఘాలకు సొంత గూడు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ
- మరో 50 భవనాల మంజూరుకు కృషి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:



డ్వాక్రా మహిళా సంఘాలకు సొంత భవనాలు అందించాలనే లక్ష్యంతో కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.7.20 కోట్ల వ్యయంతో 72 గ్రామ సమాఖ్య (వీవో) భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు శాశ్వత వసతి కల్పించడమే ఈ నిర్మాణాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

మండలాల వారీగా నిర్మాణ పనుల పురోగతి

సుజాతనగర్ మండలంలో 13 భవనాలు మంజూరు కాగా, ఒక భవనం ప్రారంభమైంది. మరో 8 భవనాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. చుంచుపల్లి మండలంలో 17 భవనాలకు అనుమతి లభించగా, రెండు భవనాలు ప్రారంభమయ్యాయి. మరో 14 భవనాల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు 21 చొప్పున భవనాలు మంజూరయ్యాయి. లక్ష్మీదేవిపల్లిలో 9, పాల్వంచలో 14 భవనాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మిగిలిన భవనాలకు త్వరలో శంకుస్థాపనలు చేయనున్నారు.

మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేయాలి

నిర్మాణాలకు సంబంధించి ఎక్కడైనా స్థల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో అన్ని భవనాల నిర్మాణాలను పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

పట్టణ ప్రాంతాలకు మరో 50 భవనాలు



కొత్తగూడెం, పాల్వంచ పట్టణ ప్రాంతాల్లోని సమాఖ్యల కోసం మరో 50 నూతన భవనాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మహిళా సంఘాలకు సొంత భవనాల కల్పనతో వారి కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించనుందని మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కాళేశ్వరం నీళ్లు వృథా...


కరువు నివారణ చర్యలేవి..?

- ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి


కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి కోరారు.గురువారం లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలోని రాయపేట ఎత్తిపోతల పథకాన్ని మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాళేశ్వరం జలాలు, హుస్సేన్మియా వాగు నీరు వృథాగా పోకుండా ఎత్తిపోతల ద్వారా చెరువులు, కుంటలు నింపి ఉంటే యాసంగి సాగుకు నీటి ఇబ్బందులు ఉండేవి కావన్నారు. గతంలో రూ.18 కోట్లతో చేపట్టిన రాయపేట ఎత్తిపోతల పథకాన్ని మరింత అభివృద్ధి చేస్తే కాల్వశ్రీరాంపూర్,ఓదెల మండలాల రైతులకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. కరువు పరిస్థితులపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి,మాజీ సర్పంచ్ భైరం రమేశ్,ఆడెపు శ్రీదేవి రాజు నాయకులు బోయిని చందర్,గణపతి రెడ్డి,నల్ల రాజిరెడ్డి,సురేష్,రామగుండం కుమారస్వామి,సక్కుల కొమురయ్య,రైతులు,మత్స్య కార్మికులు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధపడే పురుషుడు బలహీనుడా?



2024లో దేశంలో 1,70,746 మంది ఆత్మహత్య చేసుకోగా ప్రతి నలుగురిలో ముగ్గురు పురుషులే. ఇదే తీరు తెలంగాణలోనూ కనిపిస్తుంది, 2023లో మరణించిన 10,580 మందిలో 8,236 మంది పురుషులు. ఇవి పోలీసు నమోదు లెక్కలు మాత్రమే కాబట్టి వాస్తవం ఇంకా తీవ్రంగా కావచ్చు. అయినా ఇది బాధల పోటీ కాదు, ఎందుకంటే దేశంలో 22.3, తెలంగాణలో 30.8 శాతం వివాహిత మహిళలు భర్తల హింసను ఎదుర్కొన్నారని ఎన్ఎఫ్‌హెచ్ఎస్6 చెబుతోంది. కాబట్టి ఇద్దరి బాధనూ చూడగలిగే వ్యవస్థ కావాలి. పురుషుల విషయానికి వస్తే, అబ్బాయి ఎదిగే క్రమంలోనే "మగవాడు ఏడవకూడదు, కుటుంబాన్ని నడపాలి" అనే మాట మనసులో స్థిరపడుతుంది. అంతేకాక తల్లిదండ్రుల అప్పు, చెల్లి పెళ్లి, పిల్లల చదువు అన్నీ తన బాధ్యతేనని భావిస్తాడు, విఫలమైతే సిగ్గుతో మౌనం వహిస్తాడు. ఆ భారాన్ని ఎప్పుడు మోయడం మొదలుపెట్టాడో అతనికే తెలియదు, దించుకునే మార్గమూ తెలియదు. నిజానికి ఇది బలహీనత కాదు, మనసుకు శిక్షణ ఇవ్వని పెంపకం ఫలితం, పైగా స్వావలంబన నియమాలు సాయం కోరడాన్ని కష్టతరం చేస్తాయని పరిశోధకులు అంటున్నారు. ఈ భారం ఆర్థిక ఒత్తిడితో రెట్టింపవుతోంది, ఎందుకంటే 2024లో మృతుల్లో 31 శాతం దినసరి కూలీలు కాగా, 2023లో ఆత్మహత్య చేసుకున్న 14,234 మంది నిరుద్యోగుల్లో 11,775 మంది పురుషులు. ఇక అమర్త్యసేన్ చెప్పినట్లు ఆదాయం, ఉపాధి, వైద్యంపై స్వేచ్ఛ కోల్పోయినప్పుడు మనిషి సామర్థ్యమే కుంచించుకుపోతుంది, అయినా చికిత్స అందనివారు చాలా మానసిక రుగ్మతల్లో 60 శాతం దాటగా మద్యం వ్యసనంలో 86 శాతం. ఇదే సమయంలో పెళ్లయిన పురుషుల మరణాలపై చర్చ ఎక్కువే, కానీ వైవాహిక కారణాలు పురుషుల ఆత్మహత్యల్లో 3.28 శాతమే (మహిళల్లో 9.66), కాబట్టి నిర్వచనం లేని "కుటుంబ సమస్యలు" వర్గాన్ని విప్పిచూస్తేనే అసలు కారణాలు తెలుస్తాయి. వయసును బట్టి భారం మారుతుంది, అదెలాగంటే మహిళల్లో ఆత్మహత్య ప్రమాదం చిన్న వయసులోనే శిఖరానికి చేరుతుంది, 18 ఏళ్ల లోపు వారిలో మాత్రమే బాలికల సంఖ్య ఎక్కువ (2023లో 5,823 కాగా బాలురు 4,961), పురుషుల్లో ఆ ప్రమాదం పని చేసే వయసంతా కొనసాగుతుంది, సమీక్ష పూర్తికాని అధ్యయనం ప్రకారం 201923 మధ్య వారి రేట్లు అన్ని వయసుల్లో పెరిగాయి, 3044లో లక్షకు 22.56 నుంచి 27.90కి చేరింది. అంటే బాలికలకు కౌమారంలో, పురుషులకు కుటుంబ భారం పెరిగే వయసులో తోడు అవసరం. సాయం అడగని మనసు తరచూ మద్యంలో ఆశ్రయం వెతుక్కుంటుంది. ఉదాహరణకు తెలంగాణలో మద్యం తాగే పురుషులు 43.9 శాతం (దేశంలో 18.9), భర్త తరచూ తాగే ఇళ్లలో 70 శాతం మహిళలు హింసకు గురైనట్లు చెప్పారు (తాగని ఇళ్లలో 23), అందుకే మద్యం పురుషుల, మహిళల బాధలను కలిపే ఒకే దారం. ఒత్తిడి పేరుకుంటే కొందరిలో హింసగా బయటపడుతుంది, ఇందుకు సంబంధించి 2024 జైలు గణాంకాల్లో ఖైదీల్లో 95.8 శాతం పురుషులు, 4.14 శాతం మహిళలు, 72.6 శాతం ఇంకా దోషులుగా తేలని విచారణ ఖైదీలు, వారిలో దాదాపు సగం మంది 30 ఏళ్లలోపువారు, 63 శాతం పదో తరగతి దాటనివారు. ఈ పరిస్థితికి నేరశాస్త్రం మూడు కారణాలు సూచిస్తుంది, అవేమిటంటే మొదటిది దూకుడును మెచ్చే మగతనపు నియమాలు, రెండోది పురుషులకు ఎక్కువ బయటి అవకాశాలు, మహిళలపై ఎక్కువ కుటుంబ పర్యవేక్షణ, మూడోది నిరుద్యోగం, మద్యం ఒత్తిడి. ఆత్మహత్య తనపై హింస కాగా నేరం ఇతరులపై హింస, రెండింటికీ మూలం ఒకటే కావచ్చు, అయితే జైలు జనాభా నేరాల కొలమానం కాదు, పోలీసింగ్‌నూ, బెయిల్ స్తోమతనూ ప్రతిబింబిస్తుంది. ఇది మీ కథే కూడా కావచ్చు, ఎందుకంటే నెలాఖరు లెక్కలతో రాత్రంతా నిద్ర పట్టని ప్రతి తండ్రీ, ఆదాయం పడిపోయినప్పుడు అవమానంతో ఇంట్లో మాట్లాడలేని ప్రతి భర్తా, ఆరోగ్యం బాగోలేకపోయినా సెలవు తీసుకుంటే ఇల్లు గడవదని పని కొనసాగించిన ప్రతి కూలీ, "బాగున్నాను" అని చెప్పి లోపల అలసిపోయిన ప్రతి కొడుకూ, ఒత్తిడిని మద్యంతో, మౌనంతో కప్పేసిన ప్రతి స్నేహితుడూ ఇందులో ఉన్నాడు. నిజం ఏమిటంటే అతడు ఒంటరివాడు కాదు, ఎందరో పురుషులు అదే భారంతో నడుస్తున్నారు, వారికి కావాల్సింది సలహా కాదు వినే ఒక మనిషి, అంగీకరించడం ఓటమి కాదు కోలుకోవడానికి మొదటి అడుగు. ఈ నేపథ్యంలో మనసును కాపాడుకోవడం ఇంట్లో మొదలవ్వాలి, అబ్బాయికి "ఏడవకూడదు" అని కాక "చెప్పు, వింటాను" అని నేర్పాలి. ఆ తర్వాత రోజువారీ జీవితంలో నిద్ర, శారీరక వ్యాయామం, నమ్మకమైన స్నేహితులతో మాట్లాడే అలవాటు మనసుకు కవచం. అదే విధంగా బడి, కళాశాలల్లో భావోద్వేగ నైపుణ్యాల పాఠాలు, కౌన్సెలింగ్ ఇవ్వాలి. పని ప్రదేశాలు, ఆరోగ్య కేంద్రాల్లో అవమానం లేని మానసిక ఆరోగ్య తనిఖీ, చికిత్స అందించాలి. మద్యాన్ని కూడా ఆరోగ్య సమస్యగా చూసి జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో చికిత్స చేర్చాలి. ఇదే సమయంలో దినసరి కూలీలకు ఆదాయ భరోసా, యువతకు నైపుణ్య శిక్షణ, పేద ఖైదీలకు బెయిల్ సాయం ఇవ్వాలి. లెక్కల విషయంలో ఎన్‌సీఆర్‌బీ వయసు, లింగం, వృత్తి, జిల్లా వారీ లెక్కలు ప్రకటించి "కుటుంబ సమస్యలను" నిర్వచించాలి. చట్టపరంగా ఆర్టికల్ 14, 15(1) సమానత్వానికి హామీ ఇస్తున్నా కొత్త న్యాయసంహితలో 377 లేక లైంగిక దాడికి గురైన వయోజన పురుషులకు ప్రత్యేక రక్షణ లేదు కాబట్టి లింగ తటస్థ చట్టం కావాలి. సహచరులు ఒకరినొకరు "ఎలా ఉన్నావు?" అని నిజంగా అడగాలి, నిద్రలేమి, మద్యం పెరగడం, ఒంటరితనం కనిపిస్తే టెలీమానస్ 14416 ఉచితంగా అందుబాటులో ఉంది. చివరిగా ఈ పురుషులు ఎవరికో కొడుకులు, భర్తలు, తండ్రులు, వారిని విసడం మహిళలకు నష్టం కాదు, ఇద్దరినీ వినే వ్యవస్థే కావాలి.



మంచాల కిరణ్ కుమార్(Ph.D)
UGC - NET SRF స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఉస్మానియా యూనివర్సిటీ.

- మమ్మల్ని అడిగేదెవడు.. ఆపేదెవడు?
- అధికారుల అండతో రెచ్చిపోతున్న భూబకాసూర్లు, బినామీ మాఫియా!
- రోజులుగా నిశ్శబ్దం.. లంచాల మత్తులో మరింత పీకల్లోతు కూరుకుపోయిన యంత్రాంగం!
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఆర్‌టీఓ, ఫారెస్ట్, పాల్యూషన్, మున్సిపల్.. ఏ ఆఫీసు చూసినా 'మామూళ్ల' రాజ్యమే..!
- ఏసీబీ మాకెంత.. పన్నుల శాఖల తేలికపాటి చూపు..!
- కళ్లెదుటే వేల కోట్ల నల్లధనం మయం!
- నోటీసులు కాదు.. సీజ్‌లు కావాలి!
- ప్రజాధనం దోచుకుంటున్న దొంగలపై వెంటనే 'సర్జికల్ స్ట్రైక్' జరగాల్సిందే!

మమ్మల్ని అడిగేదెవడు.. ఆపేదెవడు..?

ప్రభుత్వ ఖజానాపై పెద్దల డాకా – పార్ట్ 2

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :



తెలంగాణ చౌరస్తా కథనంతో జిల్లా వ్యాప్తంగా కలకలం రేగినప్పటికీ, అవినీతి తిమింగలాల్లో మాత్రం చలనం రాకపోవడం గమనార్హం. పన్ను ఎగవేతదారులు, ఖద్దరు నాయకులు, లంచగొండి అధికారుల బంధం రోజురోజుకూ మరింత బలపడుతోంది. 'ఎవడు రాస్తే మాకేంటి.. మా దందా మాదే' అన్నట్లుగా జిల్లాలోని ప్రధాన శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. తొలి భాగంలో ఖజానా దోపిడీని వెలికితీస్తే.. ఈ రెండో భాగంలో వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకుని ఆడుకుంటున్న శాఖల వారీ దందాల అసలు రంగు బయటపడుతోంది.

ఏసీబీని లెక్కచేయని రారాజులు.. ఏ శాఖలో చూసినా అదే దందా..!

రిజిస్ట్రేషన్ల 'కల్తీ' సామ్రాజ్యం అక్రమ వెంచర్లు, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లకు సర్కిల్ ఆఫీసుల చుట్టూ కోట్లాది రూపాయల చేతులు మారుతున్నాయి. అండర్ వాల్యూ రిజిస్ట్రేషన్ల పేరుతో ఖజానాకు కన్నం వేస్తూ, అధికారుల జేబులు నింపుతున్నారు.

ఆర్‌టీఓ రోడ్ల పైన , పర్మిట్ల పేపర్లు ఓవర్ లోడు దందా..

పరిమితికి మించి లోడుతో వెళ్తున్న లారీలు, ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. నెలవారీ 'మామూళ్లు' ముడితే చాలు, ఏ నిబంధనా అక్కర్లేదనే ధోరణి స్పష్టమవుతోంది.

ఫారెస్ట్ ఆఫీసర్ల సైలెంట్ భాగస్వామ్యం.. జామాయిల్ మాయ

అడవులు కరిగిపోతున్నా, అక్రమ కలప సరిహద్దులు దాటుతున్నా ఫారెస్ట్ అధికారులు 'కళ్లున్నా చూడని' కపోతాల్లా మారారు. రియల్ ఎస్టేట్ అక్రమ ఇసుకకు మాఫియాకు అటవీ భూములు కట్టబెట్టడంలో వీరే సూత్రధారులు.

పాల్యూషన్, ఫైర్, మున్సిపాలిటీల్లో ఎన్ ఓ సిల 'సేల్'

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కాంప్లెక్సులు, పరిశ్రమలకు ఒక్క దెబ్బతో ఎన్ ఓ సి లు ఇచ్చేస్తున్నారు. లంచం ఇస్తే అక్రమ నిర్మాణం కూడా సక్రమమైపోతోంది. మున్సిపాలిటీల్లో పైసా ఇస్తే గానీ ఫైలు ముందుకు కదలడం లేదు.

మామూళ్ల మత్తులో ఏసీబీ.. నిమ్మకు నీరెత్తిన పన్నుల శాఖ..!

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేవలం చిన్న చిన్న ఉద్యోగులపై దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటోందే తప్ప.. వందల కోట్ల అక్రమార్జన చేస్తున్న ఈ 'పెద్ద తిమింగలాల' జోలికి వెళ్లకపోవడం వెనుక ఉన్న మతలబు ఏంటి? వాణిజ్య పన్నుల శాఖ, ఐటీ విభాగాలు జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న బ్లాక్ మనీ చెలామణిని చూస్తూ ఊరుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేటు పడాల్సిందే.. లేదంటే లంచగొండుల ఇళ్ల ముట్టడే..!

ఇక మాటలు లేవు.. చేతలే బాకీ! ఐటీ, జీఎస్టీ, ఏసీబీ ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగి, సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. అక్రమ ఆస్తులను జప్తు చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన అధికారులను డిస్మిస్ చేయాలి. లేనిపక్షంలో ప్రజాసంఘాలు, సమరశీల శక్తులతో కలిపి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన జ్వాలలు ఎగిసిపడటం ఖాయం!



కూరగాయల సాగుతో రైతుకు బాసట

- పెద్దపల్లి మండలంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయల సాగు
- రైతులకు జిల్లా ఉద్యానశాఖాధికారి సూచనలు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట గ్రామంలో ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న కూరగాయల పంటలను జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు గౌరవెల్లి రవీందర్ రావు తన 4.5 ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో డ్రిప్ ఇరిగేషన్,మల్చింగ్ షీట్ల వినియోగంతో అంతర పంటలుగా టమాటా,మిరప పంటలను సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు.రాబోయే సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉండే అవకాశం ఉందని,భూగర్భ జలమట్టాలు తగ్గుతూ బోరు బావులు,బావుల్లో నీటి లభ్యత క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో రైతులు అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి,పత్తి, చెరకు,మొక్కజొన్న వంటి పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు.దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి కలిగిన బెండ, అలసంద,గోరుచిక్కుడు వంటి తక్కువ నీటి అవసరమయ్యే కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు.అదేవిధంగా మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న టమాటా,పచ్చిమిర్చి, బీర కాయ,కాకరకాయ వంటి పంటలను కూడా డ్రిప్ ఇరిగేషన్ మల్చింగ్ షీట్ల వినియోగంతో సాగు చేసుకోవచ్చని తెలిపారు.ఉద్యానశాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్,మల్చింగ్ పద్ధతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో,స్థిరమైన దిగుబడులు మెరుగైన ఆదాయం పొందేలా పంటల మార్పిడికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్,ఉద్యాన విస్తరణ అధికారి రాము రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను
సద్వినియోగం చేసుకోవాలి

- తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ రావు

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా

రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ రావు కోరారు. మండలంలోని చెర్లపాలెం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఎసిఎస్) ఆధ్వర్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం కొనుగోలు కేంద్రాన్ని చర్లపాలెం సర్పంచ్ ధర్మారపు మహేందర్ తో కలిసి పిఎసిఎస్ చైర్మన్ హరి ప్రసాద్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా తాము పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకార సంఘం కృషి చేస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీనుగా రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు పులిగుజ్జ యాకన్న, ధర్మారపు యాకన్న, నాయకులు చిట్టిమల్ల మహేష్,మహబూబ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఉప్పల్ రెడ్డి, కిరణ్, సుధాకర్,యాకన్న,పాపయ్య,రైతులు తదితరులు పాల్గొన్నారు.





అశ్వారావుపేటలో వైభవంగా మహా కలశ పడిపూజా మహోత్సవం

- నేలతాళాలు, భజనలు, భక్తి నృత్యాలతో మార్మోగిన ప్రాంగణం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న మినీ స్టేడియం గ్రౌండ్‌లో మహా కలశ పడిపూజా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకకు అయ్యప్ప స్వాములు, భవానీలు, మాలధారణ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. సత్యసవంతి అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వెంకట సురేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో మహా కలశ పడిపూజా కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. శబరీష్ భజన మండలికి చెందిన నూకపంగు గోపాలకృష్ణ స్వామి బృందం ఆలపించిన భక్తి గీతాలు, నేల తాళాలు, భజనలు, పేడతలు, భక్తి నృత్యాలతో పూజా ప్రాంగణం మార్మోగింది.భక్తులు భజనల్లో పాల్గొంటూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ వేడుకలో గురుస్వాములు బుర్రా రాఘవేంద్ర శర్మ (అశ్వారావుపేట), పోతుల వరప్రసాద్ (వర్మ) (29వ పడి), ఆహ్వానిత గురుస్వామి కృష్ణ సాయి (5వ పడి) తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు. పూజ అనంతరం అయ్యప్ప స్వాములు, భవానీలు, మాలధారణ స్వాములు, భక్తులకు అల్పాహారం అందించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మండల దీక్షతో క్రమశిక్షణ, సమానత్వం

ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ, 41 రోజుల మండల దీక్షకు ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం వంటి అరిషడ్వర్గాలను జయించి, ఇంద్రియ నిగ్రహం, క్రమశిక్షణను అలవర్చుకోవడానికి ఈ దీక్ష ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.మాలధారణ సమయంలో కుల, మత, ధనిక, పేద అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ స్వామిగా భావించి గౌరవించడం ద్వారా సమానత్వం, సోదరభావం పెంపొందుతాయని వివరించారు. బ్రహ్మచర్యం, సాత్విక ఆహారం, నేలపై నిద్రించడం వంటి నియమాలు శబరిమల యాత్రకు అవసరమైన శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇరుముడి ధరించి పవిత్రమైన 18 మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడం భక్తుల ఆధ్యాత్మిక ప్రయాణంలో ఎంతో ప్రత్యేకమైన ఘట్టమని పేర్కొన్నారు. మహా కలశ పడిపూజా మహోత్సవం భక్తుల జయజయధ్వానాలు, అయ్యప్ప నామస్మరణల మధ్య విజయవంతంగా ముగిసింది.



హయత్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌లో
ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటన

- నిర్మాణ పనుల పరిశీలన..
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

ఎల్‌బీనగర్ ,తెలంగాణ చౌరస్తా:

హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మిస్తున్న నూతన భవన సముదాయాల నిర్మాణ పనులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని మూత్రశాలలు నిర్మిస్తుండటంతో చుట్టు పక్కల నివాస ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నిర్మాణాలను ప్రహరీ గోడకు ఐదు అడుగుల లోపలికి జరిపి చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దుర్వాసన సమస్య తలెత్తకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. దాతల సహకారంతో డైనింగ్ హాల్‌లో ఫ్లోరింగ్ మరమ్మతులు చేయించి, వంటశాలను అందులోకి మారుస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- 1100కు కాల్ చేస్తే చాలు! ప్రభుత్వ సేవలు
- మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ కార్యక్రమం ప్రారంభం..
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రయోజనం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఈఎస్‌డీ శాఖ, సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎస్‌సీఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, ఈఎస్‌డీ కమిషనర్ టి. రవికిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ప్రతినిధులు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే చేరుకుని అవసరమైన ప్రభుత్వ సేవలను అందించనున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కార్యాలయాలకు వెళ్లలేని వారికి ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ సేవలను పొందాలనుకునే వారు 1100 నంబర్‌కు కాల్ చేసి 1 నొక్కాలని లేదా మీ సేవ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా మీటికెట్ యాప్ ద్వారా బస్సు, మెట్రో టికెట్లు, బస్ పాస్‌లు, జూ పార్కుల టికెట్లను సైతం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయాన్ని అధికారులు పరిచయం చేశారు. ఈ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నివాస సముదాయాల్లో ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు ప్రచారం చేయాలని అధికారులు సూచించారు.






జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలో
శ్రీ రాగా విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన టి. గణవి, ఎం. హర్షిణి
- విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , తెలంగాణ చౌరస్తా:

స్థానిక మేదరబస్తీలోని శ్రీ రాగా ప్లే అండ్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్వర్ణభారతి పాఠశాల వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో శ్రీ రాగా పాఠశాలకు చెందిన టి. గణవి, ఎం. హర్షిణి ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ మల్లారపు కవిత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు మహాలక్ష్మి, గైడ్ ఉపాధ్యాయురాలు చరిత శ్రీతో పాటు ఉపాధ్యాయులు రాంబాబు, శోభారాణి, రామకృష్ణ, భాస్కర్, కీర్తి, అఖిల, వెంకట దీప్తి, వెంకటలక్ష్మి, రమ్య, స్వాతి, నాగమణి, ఆఫ్రీన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



సల్మాన్ ఖుర్షీద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

- భారత్ సమ్మిట్ వేదికగా నేతల భేటీ

ఎల్‌బీనగర్ ,తెలంగాణ చౌరస్తా :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.సమ్మిట్ వేదిక వద్ద సల్మాన్ ఖుర్షీద్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు సమకాలీన రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంలో యువత పాత్ర తదితర అంశాలపై క్లుప్తంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్, లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించిన స్కై ఫౌండేషన్

- వీధి చిన్నారులకు పలకలు, ఆట వస్తువుల పంపిణీ
- నిరాశ్రయులకు ఆహార పొట్లాల అందజేత

తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:



స్కై ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కుమారి ఓ. పావని జన్మదినాన్ని పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను సామాజిక సేవతో ముడిపెడుతూ నిరుపేద చిన్నారులు, నిరాశ్రయులకు చేయూత అందించారు.ఈ సందర్భంగా రోడ్ల పక్కన నివసించే సంచార జాతుల కుటుంబాలకు చెందిన చిన్నారులకు పలకలు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. చిన్నారులతో పాటు నిరాశ్రయులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుపేదల ముఖాల్లో ఆనందం నింపారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



ధరణి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

- కాలనీవాసుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ హామీ

మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా:

మేడిపల్లి డివిజన్ పరిధిలోని ధరణి కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు.బుధవారం కాలనీలోని సమస్యలపై జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ప్రత్యేక చొరవతో అధికారుల సమన్వయంతో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, డిప్యూటీ కమిషనర్ శైలజ కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.కాలనీవాసులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ శైలజ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ధరణి కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఏఈ సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లింగస్వామి, ధరణి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన మేడిపల్లి పోలీసులు

- నిందితుడి నుంచి 4.4 తులాల బంగారం
- 25 తులాల వెండి, సెల్‌ఫోన్ స్వాధీనం

మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా :



బోడుప్పల్‌లోని ఎస్‌బీఆర్ కాలనీలో జరిగిన దొంగతనం కేసును మేడిపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని గుర్తించి అరెస్టు చేయడంతో పాటు అతడి వద్ద నుంచి 4.4 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన ఎస్‌బీఆర్ కాలనీలో నివాసముంటున్న రవీంద్ర చారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. అనంతరం అతడి నుంచి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. నిందితుడి గత నేర చరిత్రను పరిశీలించగా, 2023లో ఇల్లెందు పోలీస్ స్టేషన్ పరిధిలోనూ అతడిపై ఒక కేసు నమోదైనట్లు గుర్తించారు.ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్ఐ బోలిశెట్టి శ్రీను, హెచ్‌సీ రాము, పీసీలు మహిపాల్, హరిబాబులను మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



యూనివర్సల్ స్కూల్ లో అవేర్నెస్ ప్రోగ్రామ్

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్ దాస్ శ్యామ్ నగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ ఐఐటీ,నీట్ ఫౌండేషన్ స్కూల్ లో బసంత నగర్ పోలీసులు పోలీస్ అక్క అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ ప్రోగ్రాంలో భాగంగా నేటి సమాజంలో ఆడుల్లలు ఎలా నడుచుకోవాలి.ప్రమాదాల నుండి ఎలా బయట పడాలి అనే అంశాల పై వారు విద్యార్థినిలకు చక్కని అవగాహన కల్పించారు.ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ మహమద్ ఇస్మాయిల్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



రాయికల్ కొనుగోలు కేంద్రంలో దళారుల దోపిడీ

- మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతుల ఆరోపణ
- క్యాష్ కటింగ్, అదనపు తూకంతో క్వింటాల్‌కు రూ.295 వరకు నష్టం
- కొనుగోళ్లపై స్పష్టమైన విధానం ప్రకటించాలి
- సింగిల్ విండో డైరెక్టర్ చాడ ప్రకాష్‌రెడ్డి

సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:

రాయికల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో దళారుల దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని సింగిల్ విండో డైరెక్టర్ చాడ ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ, అదనపు తూకం, క్యాష్ కటింగ్, ఇతర ఛార్జీల పేరుతో దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురువారం రాయికల్ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రజినీకాంత్, నర్సింగరావు, విజయ్ సందర్శించి ధాన్యం నిల్వలు, వరి కోతలు, సన్న, దొడ్డుధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సమాధానం లభించలేదని ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. క్వింటాల్‌కు రూ.295 వరకు నష్టందళారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,300కే కొనుగోలు చేస్తూ, ప్రతి లక్ష రూపాయల చెల్లింపుపై రూ.1,500 క్యాష్ కటింగ్, రూ.300 నిర్వహణ ఛార్జీలు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నట్లు తెలిపారు. బస్తాకు 67.50 కిలోల తూకం వేస్తూ, పాత కాంటాలు వినియోగిస్తున్నారని, చెల్లింపులు మాత్రం 65 కిలోల లెక్కన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,461 ఉండగా, దళారులు రూ.161 తక్కువ చెల్లిస్తున్నారని, ఇతర కోతలతో కలిపి క్వింటాల్‌కు సుమారు రూ.295 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోళ్లపై స్పష్టత ఏదీ?గత వానాకాలంలో ఇదే సమయానికి సుమారు 15 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. మిల్లు అలాట్‌మెంట్లు ప్రకటించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపుపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాయికల్‌తో పాటు సైదాపూర్ మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు వెంటనే మిల్లు అలాట్‌మెంట్లు ప్రకటించి, ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని కోరారు. దళారుల కొనుగోళ్లు, అధిక తూకాలు, అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతులతో సమావేశం నిర్వహించి కొనుగోలు విధానంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతుల పక్షాన ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పు వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చాడ ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలి

- హెచ్‌ఎండీఏ భూముల వేలాన్ని వెంటనే నిలిపివేయాలి
- బొట్టు విష్ణు డిమాండ్

కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:



కూకట్ పల్లి పరిధిలోని హెచ్‌ఎండీఏ ప్రభుత్వ భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కూకట్ పల్లి నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు, కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొట్టు విష్ణు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములు కేవలం ఆదాయ సముపార్జన కోసం వేలం వేసే ఆస్తులు కావని, అవి స్థానిక ప్రజల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ప్రజా అవసరాల కోసం వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే వేలం ప్రక్రియను నిలిపివేసి, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వ వేలాన్ని వ్యతిరేకిస్తూ మెట్రో క్యాష్ అండ్ క్యారీ సమీపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని అన్ని కుల, సామాజిక వర్గాల ప్రజలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, యువత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొట్టు విష్ణు కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.



బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉండాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి,తెలంగాణ చౌరస్తా):

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా జగదీష్ నాయక్, కార్యదర్శిగా రాయుడు నాయక్ నూతనంగా నియమితులైన సందర్భంగా గురువారం వారు రవికుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ వారికి శాలువాలు కప్పి అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, సముచిత స్థానం లభిస్తాయని, నూతన నియామకాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలని కోరారు. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ శేరిలింగంపల్లితో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ బలోపేతానికి, పార్టీ విజయానికి కృషి చేస్తామని నూతనంగా నియమితులైన జగదీష్ నాయక్, రాయుడు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ అమలుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ



- పట్టణ పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై సామర్థ్య పెంపునకు చర్యలు

శేరిలింగంపల్లి ,తెలంగాణ చౌరస్తా:

స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులకు ఒకరోజు సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. బంజారాహిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏఎస్‌సీఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. రమేష్ కుమార్, సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, ఏఎస్‌సీఐ డీన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్, సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. జనార్దన్ రెడ్డి ప్రారంభించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సీఎంసీ జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ నిర్వహణ, స్వచ్ఛ భారత్ మిషన్ అమలు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా నైపుణ్యాలపై అధికారులకు అవగాహన కల్పించారు.పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణలో ఆధునిక పద్ధతులను అమలు చేసేందుకు అవసరమైన అంశాలను ఈ శిక్షణలో వివరించారు.పట్టణ పాలనను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సీఎంసీ వర్గాలు వెల్లడించాయి.



రోగులకు ఉచిత పండ్ల పంపిణీ

- యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్

రామన్నపేట తెలంగాణ చౌరస్తా:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరి ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఉచిత పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేసి,వారి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల్లో ఆర్టిస్ట్ అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటుందని సభ్యులు తెలిపారు.



బాల్య వివాహాలను అరికట్టాలి

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని, బాల్య వివాహాలను అరికట్టాలని హరిపిరాల గ్రామ సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు, హై స్కూల్ హెచ్ఎం బి.వి రావులు అన్నారు.గురువారం మండలంలోని హరిపిరాల పాఠశాలలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (వీసీపీసీ) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాలికలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.బాలల వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిశాంత్,తస్లీమ సుల్తానా,అంగన్‌వాడీ టీచర్ పద్మ,ఆశ వర్కర్ స్వరూప,రేష్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో జీకేఎస్ హాస్పిటల్స్ ప్రారంభం

- అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి (తెలంగాణ చౌరస్తా):

గచ్చిబౌలి ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన జీకేఎస్ హాస్పిటల్స్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. అత్యవసర వైద్య సేవలు, అధునాతన వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధి డాక్టర్ కుమార్, గచ్చిబౌలి గ్రామ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్, అశోక్ సింగ్, నదీమ్, ఆష్టాల్, ఖాసీం, రవి నాయక్, ఇబ్రహీం, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పీవైఎల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- యువత సమస్యలపై సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తాం
- జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య

నూతనకల్ ,తెలంగాణ చౌరస్తా :




ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సూర్యాపేట జిల్లా 9వ మహాసభలను ఈ నెల 13న నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య తెలిపారు. ఈ మహాసభలకు యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొరతతో పాటు గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి సామాజిక సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన సమరశీల పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో గతంలో నిరుద్యోగం, విద్యారంగం, వైద్యరంగంలో నెలకొన్న సమస్యలపై అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ యువజన సంఘం నిరంతరం పోరాటాలు సాగిస్తోందన్నారు. విద్యారంగంలో మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా కూడా ఉద్యమాలు నిర్వహించినట్లు వివరించారు.జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను మహాసభల్లో సమీక్షించడంతో పాటు యువజన రంగం, నిరుద్యోగం, వైద్యరంగ సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.యువత హక్కులు, భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న పీవైఎల్ జిల్లా 9వ మహాసభల్లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నల్గొండ నాగయ్య కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని, బాల్య వివాహాలను అరికట్టాలని హరిపిరాల గ్రామ సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు, హై స్కూల్ హెచ్ఎం బి.వి రావులు అన్నారు.గురువారం మండలంలోని హరిపిరాల పాఠశాలలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (వీసీపీసీ) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాలికలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.బాలల వ్యక్తిగత పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిశాంత్,తస్లీమ సుల్తానా,అంగన్‌వాడీ టీచర్ పద్మ,ఆశ వర్కర్ స్వరూప,రేష్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి సీఐటీయూ వినతి
- ఎన్నికల హామీలు అమలు చేయకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరిక

అబ్దుల్లాపూర్ మెట్ తెలంగాణ చౌరస్తా:

రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నరసింహ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పుల నరసింహ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా రాష్ట్రంలోసుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రశంసలు పొందినప్పటికీ, నేటికీ వారికిస్థిర వేతనం లేకపోవడం విచారకరమన్నారు.
గత ఐదేళ్లుగా వేతనాలు పెరగకపోవడంతో ప్రస్తుతం అందుతున్న రూ.9,900తో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించి, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా రెండో పీఆర్సీలో కనీస వేతనం రూ.30 వేలు నిర్ణయించి డీఏ వర్తింపజేయాలని, రూ.50 లక్షల జీవిత బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు సగం పెన్షన్ అందించాలని కోరారు. వేతనంతో కూడిన వైద్య, ప్రసూతి సెలవులు, ఏడాదికి 20 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోతే ఇప్పటికే ఇచ్చిన సమ్మె నోటీసు ప్రకారం అందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ మండల సత్యనారాయణ, ఆశా వర్కర్లు జయమ్మ, వనిత, పారిజాత, కవిత, ఇందిర, శైలజ, సాయి ప్రియ, సుందరి, యమున తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాసరచన, ప్రశ్నోత్తరాల పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం
- పాల్గొన్న ఎన్నికల అధికారులు, ప్రధానోపాధ్యాయులు

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, ప్రశ్నోత్తరాల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఉన్నత పాఠశాల, కళాశాల విభాగాల్లో నియోజకవర్గ స్థాయి తుది పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి డి. వేణుగోపాల్, అదనపు ఎన్నికల అధికారి, తహసీల్దార్ డి. కిషోర్, ఎన్నికల ఉప తహసీల్దార్ సయ్యద్ హుస్సేన్, వి.కె.డి.వి.ఎస్. కళాశాల ప్రధానాచార్యులు సురేష్ బాబు, మండల విద్యాశాఖాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు. అలాగే దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

